స.హ.చట్టంపై అధికారుల్లో చిన్నచూపు!

- పాలకుల తీరుతో నానాటికీ కనుమరుగవుతున్న సమాచారహక్కు చట్టం
- అప్‌డేట్ అయ్యేందుకు ఆసక్తిచూపని పలువురు అధికారులు
- చట్టంపై ప్రజలకు కొరవడిన అవగాహన



సమాచారహక్కు చట్టం బోర్డ్ లేని నందిగామ తహసీల్దార్ కార్యాలయం

నందిగామరూరల్: ప్రభుత్వ పాలనలో జరుగుతున్న మంచిచెడుల సమాచారంపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకునేందుకు ప్రజలకు అందుబాటులో ఉన్న పాశుపతాస్త్రం..సమాచారహక్కు చట్టం (స.హ.చట్టం). ఈ సమాచారహక్కు చట్టం ద్వారా పౌరులెవరైనా అభివృద్ధి, సంక్షేమ పథకాలు తదితర ప్రభుత్వ వివరాలను తెలుసుకోవచ్చు. దేశ రక్షణ, భద్రతకు సంబంధించిన వివరాలు మినహా ఏ సమాచారాన్నైనా ఈ సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకునే వీలుంది. అయితే కొంతమంది అవినీతి అధికారులు తమ బాగోతాలు బట్టబయలు కాకుండా ఉండేందుకు ఈ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. నందిగామలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ అధికారుల్లో పలువురు ఈచట్టంపై చిన్నచూపు చూస్తున్నారు. ఇటువంటి అధికారుల అలసత్వం కారణంగా సమాచార హక్కు చట్టంపై నేటి యువతలో అవగాహన కొరవడుతోంది.

బోర్డులు పెట్టారు..వివరాలు మరిచారు!

సమాచార హక్కు చట్టం 2005మే 11వ తేదీన అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణకేగాక ప్రభుత్వ పథకాల్లో అవకతవకలను ఈ చట్టంతో నియంత్రించవచ్చు. కాని ఆయా కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం ప్రాధాన్యతను వివరిస్తూ సమాచార బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంది. నందిగామ పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం బోర్డులు లేవు. బోర్డులో ఆయా కార్యాలయంలో అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నంబరుతో సహా వివరాలను తెలియజేయాల్సి ఉన్నప్పటికీ ఆయాశాఖల అధికారులు అవేమి పట్టించుకోకపోతుండటం గమనార్హం. అదేవిధంగా నందిగామలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ చట్టం అమలులోకి వచ్చినపుడు ఏర్పాటు చేసిన బోర్డులే దర్శనమిస్తున్నాయి. సదరు కార్యాలయ అధికారి బదిలీ జరిగినపుడు ఆస్థానంలో కొత్తగా వచ్చిన వారి పేరు, ఇతర వివరాలను మార్పు చేయకుండా అలానే వదిలివేస్తున్నారు. దీంతో సమాచార హక్కు చట్టం కింద ఏ అధికారికి అర్జీ దాఖలు చేసుకోవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇటువంటి పరిస్థితుల కారణంగా సమాచారహక్కు చట్టం ఒకటి ఉందనే సమాచారం కూడా రోజురోజుకు మరుగునపడిపోతోంది. ఈ బోర్డులపై పేర్లు, ఫోన్‌నంబర్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.



వివరాలు లేకుండా ఉన్న నందిగామ ఆర్డీఓ కార్యాలయంలోని బోర్డు



రిటైర్డు అధికారి పేరుతో ఉన్న నందిగామ మండల పరిషత్ కార్యాలయంలోని స.హ.చట్టం బోర్డు

లొసుగులు వెలుగుచూస్తాయనే..

సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తే తాము చేసిన లొసుగులు బట్టబయలు అవుతాయనే అలజడి కొందరు అవినీతి అధికారుల్లో ఉంది. మరోవైపు ఎక్కడ పని భారం పెరుగుతుందోనని ఉద్దేశంతో కూడా పలువురు అధికారులు ఈ చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. సమాచార హక్కుచట్టం కింద ఆయా సమాచారం కోరుతూ దరఖాస్తు చేసుకున్నవారికి శాఖల వారీగా నిర్ణీత కాలంలో అడిగిన పూర్తిస్థాయి సమాచారాన్ని ఇవ్వవలసి ఉంటుంది. ఈ పరిణామాలన్నీ అధికారులకు ఇబ్బందులు కలిగిస్తాయని, అందుకే ఈచట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈచట్టం అమల్లోకి వచ్చి 19ఏళ్ల గడిచినా...కొంతమంది అవినీతి అధికారులు మాత్రం దీనిని ప్రజల్లోకి వెళ్లనీయకుండా మోకాలడ్డుకుంటున్నారనే చెప్పాలి. ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫారాలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఇలా సమాచారహక్కు చట్టం అమలులో పలువురు అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యపు వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెండు దశాబ్దాలైనా అంతంతమాత్రమే..

సమాచార హక్కు చట్టం రూపొందించి 20ఏళ్ల అవుతున్నా ఈ చట్టం గురించి తెలియనివారున్నారంటే అతిశయోక్తి కాదు. సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకొంటే దానికి సంబంధించిన వివరాలను పూర్తిస్థాయిలో లిఖిత పూర్వకంగా అందజేయాల్సి ఉంటుంది. ఒకవేళ సరైన సమాచారం ఇవ్వకుంటే ఆ చట్టంలోని 18(1) సెక్షన కింద మళ్లీ దరఖాస్తు చేసుకొనే వీలును కూడా కల్పించడంతో అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చట్టంపై అవగాహన కల్పించాలి...



సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు శ్రద్ధ చూపటం లేదు. ఈ చట్టం వచ్చి 20ఏళ్లవుతున్నా చట్టం ఉందని తెలియనివారు కూడా ఉన్నారు. చట్టం వచ్చిన మొదటిలో ఫర్వాలేదనిపించినా రానురాను నిర్వీర్యమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమాచారహక్కు చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి.

– ఉలవలపూడి నరేంద్ర, నందిగామ

పాత బోర్డులు దర్శనమిస్తున్నాయి...



ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఉన్న సమాచారహక్కు చట్టం బోర్డులపై చట్టాన్ని అమలుచేసే అధికారుల పేర్లు, వివరాలు నమోదు చేయాలి. ఈ చట్టం గురించి తెలియక ప్రజలు చట్టాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా కార్యాలయాల్లో పూర్తి వివరాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలి.

–కటారపు గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, నందిగామ

క్లుప్తంగా

రైతు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): వ్యవసాయాధికారులు రైతు విశిష్ట సంఖ్య నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి సూచించారు. మండలంలోని అనమంచిపల్లి గ్రామంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయాధికారులు రైతు విశిష్ట సంఖ్య నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి అనే విషయాన్ని రైతులంతా గమనించాలని సూచించారు. విశిష్టసంఖ్యను నమోదు చేయించుకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలను పొందే వీలుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ భవాని, ఏఓ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ దేవాలయ ప్రతిష్టాపన



చందర్లపాడు(నందిగామరూరల్): గ్రామస్తులంతా కలిసిమెలిసి ఐక్యంగా పరిశుద్ధ ఆంద్రేయ సిఎస్ఐ దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకోవడం అభినందనీయమని మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం బొబ్బెళ్లపాడులో సీఎస్ఐ దేవాలయ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ దైవసేవకుల సమక్షంలో ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కృష్ణా,గోదావరి అధ్యక్ష ఖండం పీఠాధిపతి తంటిపూడి జార్జి కొర్నెలియస్ క్రీస్తు సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ముక్కపాటి నరసింహారావు, సర్పంచ్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండా కృష్ణారెడ్డి, వైఎస్ఎన్ ప్రసాద్, నాయకులు, సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

48గంటలపాటు మద్యం షాపులు బంద్

కంచికచర్ల : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈనెల 27వతేదీన జరుగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల నుంచి గురువారం సాయంత్రం ఐదు గంటల వరకు మద్యం షాపులు మూసివేస్తున్నట్లు కంచికచర్ల ఎక్సైజ్ సీఐ షేక్ అఫ్రపున్నీసాబేగం సోమవారం తెలిపారు. షాపులు తిరిగి గురువారం సాయంత్రం ఐదుగంటల తర్వాత తెరుచుకుంటాయని వివరించారు.

ఉపాధి పనుల పరిశీలన

గండేపల్లి(కంచికచర్ల): రైతులు తమ పంట పొలాల్లో నీటి నిల్వల కోసం ఫార్మ్‌పాండ్‌లను తవ్వుకోవాలని ఉపాధి హామీ పథకం ఏపీఓ రమాదేవి సూచించారు. మండలంలోని గండేపల్లిలో రైతు పొలంలో ఉపాధి కూలీలు తీస్తున్న నీటి గుంతను సోమవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ మండలానికి 150 నీటిగుంతలు మంజూరుకాగా, 25 నీటి గుంతల తవ్వకం పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. నీటిగుంతలు తీసుకుంటే రైతులు తమ పంట పొలాల్లో నీలిమందులు పిచికారీ సమయంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. పంట పొలాలు ఎండిపోకుండా సాగునీటిగా ఉపయోగించుకోవచ్చన్నారు. అదేవిధంగా ప్రతిఒక్కరూ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు తీసుకుంటే, వారికి కూడా బిల్లులు మంజూరు చేస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బి.మోహన్, టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కళ్లజోళ్ల పంపిణీ



నందిగామరూరల్: విద్యార్థుల్లోని అంధత్వ నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రధానోపాధ్యాయుడు బండారు లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని ఐతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం దృష్టిలోపం ఉన్న ఐదుగురు విద్యార్థులకు సోమవారం ఆయన కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబరులో జాతీయ అంధత్వ నివారణలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారని వివరించారు.

కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



కేఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: నిజాయితీ, నిబద్ధత కలిగిన కేఎస్ లక్ష్మణరావుకు ఓటువేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్.లక్ష్మణరావుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నందిగామ పట్టణంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటర్లకు కరపత్రాలు పంచుతూ ఓటు వేయాలని కోరారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు శాసన మండలిలోకి వెళ్లిన తరువాత ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వం, ప్రైవేటు కళాశాలల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మొదలగువారి సమస్యలను శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా అనేక సమస్యలు పరిష్కారం అయ్యేలా కృషి చేశారన్నారు. ఓటర్లు తమ మొదటి ప్రాధాన్యత ఓటును బ్యాలెట్ పేపర్‌లో 23వ నంబరుకు ఓటు వేసి కేఎస్ లక్ష్మణరావుకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కోటా రవికుమార్, దంతాల నరేంద్ర, వి.వి.రాంప్రసాద్, జె.వెంకట్రావు, కాకనబోయిన వెంకటేశ్వరరావు, కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ

నందిగామటౌన్(నందిగామరూరల్): అడ్వకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్–2025తో న్యాయవాద వృత్తికి విఘాతం కలుగుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబువిద్యాసాగర్ అన్నారు. ఈ యాక్టును నిరసిస్తూ న్యాయవాదులు సోమవారం తమ విధులు బహిష్కరించి నందిగామ న్యాయస్థాన సముదాయ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తిని అగౌరవపరిచేలా అమెండ్‌మెంట్ యాక్ట్‌ను ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు పునరాలోచన చేసి ఈ యాక్టును తక్షణమే రద్దు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమాలు మంగళవారం కూడా జరుగుతాయని, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, పింగళి లక్ష్మీ నరసింహారావు, కృష్ణంరాజు, విజయబాబు, రవికుమార్, షేక్ సైదా, కొమ్మినేని మౌలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చప్టాల నిర్మాణం ప్రారంభం



కొణకంచి వద్ద వాగుపై చేపట్టిన నూతన చప్టా నిర్మాణం



పెనుగంచిప్రోలు చెరువు అలుగులు వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: మండలంలో ప్రమాదకరంగా మారిన చప్టాలపై ఇటీవల 'సాక్షి' దినపత్రిక ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఆయాచోట్ల నూతన చప్టాల నిర్మాణం చేపట్టారు. పెనుగంచిప్రోలు మండలంలోని జాతీయ రహదారి నుంచి కొణకంచి వెళ్లే రోడ్డులో వాగుపై చప్టా పూర్తిగా శిథిలంకాగా, పెనుగంచిప్రోలు నుంచి ముండ్లపాడు వెళ్లే రోడ్డులో చెరువు అలుగులు వద్ద వరదకు చప్టా మొత్తం కొట్టుకుపోయింది. రెండుచోట్ల నూతన చప్టాల నిర్మాణ ఆవశ్యకతను వివరిస్తూ 'సాక్షి' దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు కొణకంచి రోడ్డులో నూతన చప్టాను నిర్మాణం చేపట్టారు. ముండ్లపాడు వెళ్లే రోడ్డులో చెరువు అలుగులు వద్ద చప్టా నిర్మించేందుకు వీలుగా డైవర్షన్ రోడ్డు కోసం మట్టిరోడ్డు నిర్మాణం చేపట్టారు. చప్టాల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తంచేస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' దినపత్రికకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నీటి తరలింపును అడ్డుకున్న రైతులు



పైపులైను పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు, రైతులు

నందలూరు(వీరులపాడు): గ్రామంలోని వైరా ఏటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలోని సెంధినీ కర్మాగారానికి నీటిని తరలించేందుకు చేపట్టిన మోటార్ల ఏర్పాటును గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. నందలూరు సమీపంలోని వైరాకట్టలేరులో మంచి నీటి పథకం ద్వారా నందలూరు, తాటిగుమ్మి, బోడవాడ, జమ్మవరంలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఈక్రమంలో సెంధినీ కర్మాగారం ప్రభుత్వ పోరంబోకు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా తూములు ఏర్పాటు చేసి నీటిని తరలించేందుకు పైపులైన్ ఏర్పాటు చేస్తుండటంతో గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. మోటార్లతో నీటిని తరలిస్తే తీవ్ర తాగు, సాగు నీటిఎద్దడి నెలకొనే అవకాశం ఉందని, తక్షణమే పనులను నిలుపుదల చేయాలంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. కంపెనీ ప్రతినిధులు రైతులను సముదాయించే ప్రయత్నం చేయగా ఫలితం లేకపోవడంతో చివరికి వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఏలూరు సురేష్, జూపూడి కోటేశ్వరరావు, జూపూడి బాబు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని దుర్గాపురంలో వేంచేసియున్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం 31వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో తరలి వచ్చిన భక్తులు శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి దేవస్థాన ప్రధానార్చకులు చింతా శివరామశర్మ ఆధ్వర్యంలో భక్తులు పంచామృత అభిషేకాలు, హోమాలు, కంకుమార్చన చేశారు. మహిళా కోలాట బృందం వారి నృత్యాలు అలరించాయి. భక్తులకు అన్నదానం చేశారు. దేవస్థానం కమిటీ సభ్యులు రామిశెట్టి నరసింహారావు, వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి శేషుకుమార్, అనిల్, కొల్లు గోవిందు, మేళం భాస్కర్ తదితరులు పాల్గొని భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైఎస్సార్ సీపీ నేతల పూజలు...

అమ్మవారి వార్షికోత్సవం వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. పేట పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, పేట పట్టణ యువజన విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉపేందర్‌రెడ్డి, గొట్టిపాళ్ల సురేష్, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు పింగళి నర్సింహారెడ్డి, మన్నె అప్పారావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

చురుగ్గా మహాశివరాత్రి ఏర్పాట్లు



జల్లు స్నానాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు



పుష్కర ఘాట్‌లను ఫైర్ ఇంజిన్లతో శుభ్రం చేస్తున్న సిబ్బంది

ముక్త్యాల(జగ్గయ్యపేట): ఈనెల 26వతేదీ మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ముక్త్యాల భవానీ ముక్తేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఏటా కృష్ణా నదిలో పుణ్య స్నానాలాచరించేందుకు, స్వామివారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. శివరాత్రి ఒక్కరోజునే వేలాది మంది భక్తులు తరలి వచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకిస్తారు. పెద్దసంఖ్యలో భక్తులు వస్తుండటంతో ఆలయం వద్ద అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా భవానీ ఆలయం చుట్టూ చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. నది వద్ద జల్లు స్నానాలతోపాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఘాట్‌వద్దనే ప్రత్యేక స్నానాలకు, మొబైల్ మరుగుదొడ్లను ఏర్పాట్లు చేస్తున్నారు. నదిలోకి వెళ్లకుండా మెస్, గజ ఈతగాళ్లు, పడవలను సిద్ధం చేశారు. ముఖ్యంగా తెల్లవారుజామునే భక్తులు రానుండటంతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయం వద్ద చేపట్టిన ఏర్పాట్లను సోమవారం రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ శాఖాధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యేక బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తులో భాగంగా డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అధికారులు చెబుతున్నారు. పుష్కర ఘాట్‌లను కేసీపీ యాజమాన్యం సహకారంతో ప్రత్యేక ఫైర్ ఇంజన్‌లతో శుభ్రం చేయగా, జల్లు స్నానాల ట్రయల్ రన్‌ను ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, కెసీపీ ప్రతినిధి రాంప్రసాద్, ఆలయ ఈవో సురేష్‌బాబు పర్యవేక్షించారు. అదేవిధంగా గ్రామ సమీపంలోని కోటి లింగ హరిహర మహాక్షేత్రంలోని కామాక్షి సమేత పంచముఖ అమృతలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కూడా శివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మహాశివరాత్రి ఉత్సవాల ప్రత్యేకాధికారి ఎంకెటిఎస్ ప్రసాద్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ ఏడాది స్వామివారి కల్యాణాన్ని ఆరుబయట చేస్తుండటంతో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



నందిగామరూరల్: మహాశివరాత్రి పండుగ సందర్భంగా దాములూరు కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను నందిగామ ఏసీపీ తిలక్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరునాళ్ల మహోత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. జల్లు, పుణ్యస్నానాలు, దుస్తులు మార్చుకునే గదులు, క్యూలైన్లు తదితర ఏర్పాట్లపై దృష్టి సారించాలని ఆలయ సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్‌కు తీసుకున్న చర్యలను పరిశీలించారు. అనంతరం ఆలయ అధికారులు, ఆయా శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ వైవిఎల్ నాయుడు, ఈఓ నరసింహమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యుడు గింజుపల్లి శ్రీనివాసరావు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ముక్త్యాల(జగ్గయ్యపేట): భవానీ ముక్తేశ్వర స్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారణాసి సాంబశివరావు, దూమాటి లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, శైవ పుణ్యాహవచనం, దీక్షా వస్త్రధారణ, అఖండస్థాపన, అంకురార్పణ, వాస్తుపూజ, అగ్నిముఖ ధ్వజారోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కానూరి సురేష్‌బాబు, ఆలయ ధర్మకర్త తరపున రాంప్రసాద్, సిబ్బంది నాగార్జున, గ్రామస్తులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆప్కాస్ రద్దు తగదు



నందిగామటౌన్(నందిగామ రూరల్): టీడీపీ కూటమి ప్రభుత్వ విధానాలు కార్మికుల్లో భయాందోళన కలిగిస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ అన్నారు. ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికులు, ఉద్యోగులతో కలిసి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి పాత పద్ధతిలో ప్రైవేట్ ఏజెన్సీలకు పారుగు సేవల సిబ్బందిని అప్పగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ నుంచి బయటకు తీసుకువచ్చి పర్మినెంట్ చేయడం మానేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తామనడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు నరేష్, సైదా, ప్రసాద్, సతీష్, బేబి, రూతమ్మ, మాణిక్యం, పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



జగ్గయ్యపేటఅర్బన్: భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన ఎన్నో దశాబ్దాల పోరాటాల ఫలితంగా ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నేడు నిర్వీర్యమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మిక సంక్షేమం బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న 46 వేలకు పైగా క్లైయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజి శివాజీ, పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు నీలకంఠం శివప్రసాద్, సంఘ నాయకులు వేముల శ్రీను, బత్తుల వెంకటేశ్వర్లు, చిక్కం నాగేశ్వరరావు, నీలకంఠం నరసింహారావు, కార్మికులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

జగ్గయ్యపేటఅర్బన్: ఎండలు విపరీతంగా ఉండటంతో పురపాలక సంఘం పరిధిలోని ఆయా కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయించాలని సామాజిక వేత్త లంకపల్లి రవిప్రసాద్ కోరారు. ఈమేరకు ఆయన మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో కోదాడ రోడ్, విజయవాడ ప్రధాన రోడ్‌లలో దుమ్ము దూళి విపరీతంగా ఉన్నందున మిషన్‌తో తొలగించాలని కోరారు. అలాగే ఎర్రకాలువ, వేపలవాగు ప్రక్షాళన చేయాలని, రైతుబజారు వద్ద ప్రధాన రహదారిపై తోపుడు బండ్లు, ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

రైతులతో సమావేశం

గరికపాడు(జగ్గయ్యపేట): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగాన్ని రైతులకు ప్రత్యేక స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. పీఎం కిసాన్ నగదు బదిలీ పథకం ద్వారా రైతు ఖాతాలలో నగదు జమ చేస్తున్నందున ఆ కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించారు. కేవీకే ప్రతినిధులు అచ్యుతరాజు, ఏడీఏ భవానీ, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.